క్లుప్తంగా

మారెమ్మ దేవస్థానం హుండీ ఆదాయం రూ.6.73 లక్షలు



పుట్రేల(విస్సన్నపేట): మండలంలోని పుట్రేల గ్రామంలో ఉన్న మారెమ్మ అమ్మవారి దేవస్థానానికి చెందిన మూడు హుండీలను బుధవారం లెక్కించామని ఆలయ ఈఓ వై.సీతారామయ్య తెలిపారు. 70 రోజులకు రూ.6,73,723 ఆదాయం వచ్చిందన్నారు. దేవదాయశాఖ గన్నవరం తనిఖీదారు ఎ.శ్రీనివాసరావు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కోటగిరి వెంకట సత్య శేష సునీల్, రెవెన్యూ, పోలీస్ అధికారులు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, సత్యసాయి సమాజ సభ్యులు, భక్తుల సమక్షంలో హుండీ కానుకలను లెక్కించారు.

డంపింగ్ యార్డులోనే చెత్త వేయాలి



విస్సన్నపేట: స్థానిక నూజివీడు రోడ్డులో రాణి కల్యాణ మండపం ఎదురుగా గ్రామ పంచాయతీ డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించామని ఆ స్థలంలోనే చెత్త వేయాలని ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ తెలిపారు. స్థానిక బస్టాండ్ పరిసర ప్రాంత వాసులు చెత్తను బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు డంపింగ్ యార్డుకు కేటాయించిన స్థలంలో చెత్త డంపింగ్‌ను బుధవారం ప్రారంభించామని ఈఓ శ్రీనివాసరావు తెలిపారు.

వీధి కుక్కలకు రేబిస్ వ్యాక్సినేషన్



నూజివీడు: పట్టణంలోని వీధి కుక్కలకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బుధవారం రేబిస్ వ్యాక్సినేషన్ నిర్వహించారు. పశువైద్య సిబ్బంది వీధి కుక్కలను పట్టుకుని వాటికి రేబిస్ వ్యాక్సిన్ వేశారు. వ్యాక్సిన్ వేసిన కుక్కలకు గుర్తుగా తలపై పసుపు రంగును వేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్ ఆధ్వర్యంలో హెల్త్ అసిస్టెంట్ నాగరాజు నేతృత్వంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల పట్టణంలో వీధికుక్కలు బాగా పెరిగిపోవడంతో వాహనదారుల వెంబడి పడుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు వివరించారు. దీంతో మున్సిపాలిటీ పాలకవర్గం స్పందించి వీధి కుక్కలకు రేబిస్ వ్యాక్సినేషన్ చేయిస్తున్నారు.

నవధాన్యాల సాగుపై అవగాహన



చాట్రాయి: మండలంలోని జనార్దనవరం గ్రామంలో బుధవారం రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో నవ ధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నవ ధాన్యాల్లో పలు రకాల ఖనిజ లవణాలు ఉంటాయని వీటిని తినడం వలన మనిషి ఆరోగ్యకరంగా జీవిస్తాడన్నారు. కిచెన్ గార్డెన్ ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఆ శాఖ మండల ఇన్‌చార్జి చంటి, మాజీ సర్పంచ్ పాములర్తి నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి చర్యలు



జి.కొండూరు: స్థానిక హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ తెలిపారు. దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోక అస్తవ్యస్తంగా ఉన్న శ్మశానవాటికను తహసీల్దార్ రోహిణీ దేవి, ఎంపీడీఓ అనూరాధతో కలిసి ఎంపీపీ బుధవారం పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ శ్మశానవాటికలో సత్వరమే జంగిల్ క్లియరెన్స్ చేసి ప్రహరీ, షెడ్డు నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు

- ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు
- పాతరావిచర్లలో 'గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం'



పాతరావిచర్లలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని పాతరావిచర్లలో బుధవారం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో ఇంటింటికీ పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు.

సీఎం వైఎస్ జగన్‌కు అండగా నిలవాలి..

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తోన్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని చెప్పారు. ప్రతి నెలా ఒకటో తేదీనే వలంటీర్లు గడప వద్దకు వచ్చి పింఛన్లను అందిస్తున్నారని, దీంతో వృద్ధులంతా సంతోషంగా ఉన్నారన్నారు. ప్రజల సమస్యలను అధికారులు నిరంతరం తెలుసుకుంటూ వాటిని పరిష్కరించాలని సూచించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని వంద శాతం అమలు చేసిందని గుర్తు చేశారు. అంతేగాకుండా అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. చంద్రబాబును ప్రజలు నమ్మొద్దని, టీడీపీ వస్తే ఈ పథకాలన్నింటిని ఎత్తేసి, ప్రజల నెత్తిన భారం మోపుతుందన్నారు. చంద్రబాబుకు ప్రజలను మోసం చేయడం వెన్నతో పెట్టిన విద్యని, ఈ విషయాన్ని ప్రజలందరూ గ్రహించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ప్రజలు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, బసవరాజు నగేష్, సర్పంచ్ బసవరాజు అన్నపూర్ణమ్మ, ఉప సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు బొర్రా సాంబశివరావు, నాయకులు దేవరకొండ మధు, మరీదు మోహన్, ఏపీసీపీడీసీఎల్ డీఈ ఒలేటి దుర్గారావు, ఏపీఎం దయాల రాజశేఖర్, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన

- ఎమ్మెల్యే రక్షణనిధి
- తిరువూరు 18వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

తిరువూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన అందిస్తున్నామని తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి అన్నారు. తిరువూరు 18వ వార్డులో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించి, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యత..

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తిరువూరు పట్టణంలో గతంలో కంటే ఈ ప్రభుత్వంలో మెరుగైన అభివృద్ధి జరుగుతోందన్నారు. పట్టణంలో పెరుగుతున్న జనాభా అవసరాల కనుగుణంగా నగర పంచాయతీకి ఆర్థిక వనరులు తక్కువగా ఉన్నా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. శివారు ప్రాంతాల్లో సైతం విద్యుత్, తాగునీరు, రహదారి సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. 18వ వార్డు కౌన్సిలర్ దారా నీలిమ, నాయకులు రేగళ్ల మోహన రెడ్డి, శ్రీనివాసరావు, వేణుబాబు, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ విజయలక్ష్మి, విజయవాడ దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థాన పాలకవర్గ సభ్యుడు దేవిశెట్టి బాలకృష్ణ, నగర పంచాయతీ కౌన్సిలర్ పరసా సత్యనారాయణ పాల్గొన్నారు.



తిరువూరులో ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



నూజివీడు ఏరియా ఆస్పత్రిలో అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది



మైలవరం ఆస్పత్రిలో డెమో నిర్వహిస్తున్న ఫైర్ సిబ్బంది

నూజివీడు: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా చూడడం, ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపక అధికారి కె.భాస్కరరామం ఆధ్వర్యంలో వైద్యులకు సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం అగ్నిప్రమాదాల నివారణ చర్యలకు సంబంధించిన కరపత్రాలను వైద్య సిబ్బందికి, ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫైర్ స్మోక్ డిటెక్టర్లు ఏర్పాటు చేయాలి

మైలవరం: పాఠశాలలు, ఆస్పత్రుల్లో తప్పని సరిగా ఫైర్ అలారం, ఫైర్ స్మోక్ డిటెక్టర్లు ఏర్పాటు చేయాలని ఫైర్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మైలవరం ఫైర్ స్టేషన్ ఆధ్వర్యంలో 6వ రోజు స్థానిక అను హాస్పిటల్, ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రుల్లో అగ్ని ప్రమాదాలు, భద్రతా పరికరాలను ఫైర్ ఆఫీసర్ వివరించారు. ఆస్పత్రి సిబ్బందికి ఫస్ట్ ఎయిడ్ ఫైర్ ఫైటింగ్‌పై డెమో ద్వారా అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగినప్పుడు క్షేమంగా తప్పించుకునేందుకు సరైన ప్రణాళికను రచించి, అది అందరికీ తెలిసే విధంగా తగిన ప్రదేశాల్లో ఉంచాలన్నారు. పాఠశాలలు, ఆస్పత్రుల్లో బయటకు వెళ్లే మార్గాల్లో ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఫైర్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

నూజివీడు: ప్రజా వ్యతిరేక విధానాలను పాటిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీలకు దారాదత్తం చేస్తోన్న కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో ఇంటికి పంపించి దేశాన్ని కాపాడుకోవాలని సీపీఐ రాష్ట్ర సమితి నాయకులు చలసాని వెంకట రామారావు పిలుపునిచ్చారు. సీపీఐ, సీపీఎంల సంయుక్త ఆధ్వర్యంలో మోదీ హటావో.. దేశ్‌కా బచావో కార్యక్రమంలో భాగంగా ప్రచారభేరి జాతాను బుధవారం నూజివీడు పెద్ద గాంధీబొమ్మ సెంటర్‌లో ఆయన ప్రారంభించారు. కేంద్రం అవలంబిస్తున్న విధానాలను ఎండగట్టారు. నాయకులు ఎస్ఆర్ హనుమాన్లు, జి.రాజు, బత్తుల వెంకటేశ్వరరావు, చాట్ల పుల్లారావు, మాదిరెడ్డి శ్రీనివాసరావు, కె.కృష్ణ, తాడి సత్యనారాయణ, బోను చందర్‌రావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

డీసీపీ ఆకస్మిక పర్యటన



జి.కొండూరు పీఎస్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీసీపీ అజిత వాజెండ్ల

జి.కొండూరు: జి.కొండూరు పోలీసుస్టేషన్‌ను డీసీపీ అజిత వాజెండ్ల బుధవారం రాత్రి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రికార్డులను ఆమె పరిశీలించారు. సమస్యలతో పోలీసుస్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల సిబ్బంది స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. కేసుల పరిష్కారంలో ఎటువంటి అలసత్వం లేకుండా సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మైలవరం ఏసీపీ రమేష్, సీఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐ ధర్మరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దాత రవికుమార్

రెడ్డిగూడెం: విద్యార్థి దశలో ప్రాథమిక విద్యే కీలకమని నాగులూరు విజయబాబు కాలనీ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం గార్లపాటి అనుగ్రహ ప్రసాద్ అన్నారు. పాఠశాల వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ప్రాథమిక విద్యలో మంచి పునాది నిర్మించుకోగలిగితే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. విద్యార్థులు నృత్యాలతో అలరించారు. మార్కులు, హాజరులో ప్రతిభకనబరచిన విద్యార్థులకు దాత కలకొండ రవికుమార్ బహుమతులు అందజేశారు. పాఠశాలలో మౌలిక వసతులు సమకూర్చడంలో గ్రామ నాయకులు కలకొండ రామారావు సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. ఉపాధ్యాయిని ఎస్‌కే షకీలా, వైస్ చైర్మన్ తొమ్మండ్రు వీరయ్య, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సామూహిక ఉచిత వివాహాలకు దరఖాస్తుల స్వీకరణ

చాట్రాయి: తల్లిదండ్రులు లేని వివాహం కుదుర్చుకున్న వధువులకు ఉచిత వివాహాలు చేయనున్నట్లు భగవాన్ శ్రీ సత్యసాయి సేవా ట్రస్ట్ అధ్యక్షుడు జె.రంగారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మే 8వ తేదీలోగా తగిన వివరాలతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, రిజిస్ట్రేషన్ చేయించుకున్న వధువులకు మే 14న ఆదివారం ఉదయం వివాహాలు జరిపిస్తామని చెప్పారు.

ఉత్సాహంగా కోడింగ్ ఫెస్ట్



తిరువూరు వాహినీ కాలేజీలో కోడింగ్ ఫెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు

తిరువూరు: స్థానిక శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం కోడింగ్ ఫెస్ట్ – 2023 ఉత్సాహంగా జరిగింది. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో వస్తున్న సాంకేతిక మార్పులు, కోడింగ్‌లో మెలకువలపై బ్రెయినోవిజన్ టెక్నాలజీస్ సంస్థ నిపుణులు మూడు రోజులుగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు కోడింగ్ విధానంపై బుధవారం పోటీలు నిర్వహించారు. 100 మంది విద్యార్థులు 18 బృందాలుగా ఏర్పడి పోటీల్లో పాల్గొన్నారు. సాఫ్ట్ స్కిల్స్ రూపొందించడంలో ప్రతిభ కనబరచిన గ్రూపులకు బహుమతులను కళాశాల చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు అందజేశారు. ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, కరస్పాండెంట్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు రక్షణ చర్యలు చేపట్టాలి



విస్సన్నపేట: ఉపాధి కూలీలకు వడదెబ్బ ప్రభావం పడకుండా పని ప్రదేశంలో రక్షణ చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఎస్ వెంకటరమణ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లకు బుధవారం సమావేశం నిర్వహించారు. వైద్య కిట్లు, ఓఆర్ఎస్, మజ్జిగ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఉదయం వేళల్లో పనులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన మేరకు పట్టాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏపీఓ అనురాధ, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం



మైలవరంలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ రంగారావు

ఇబ్రహీంపట్నం: వేసవిలో చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయమని కొండపల్లి మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఇబ్రహీంపట్నం రింగ్‌సెంటర్ మైలవరం బస్ స్టాప్ వద్ద అభ్యుదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. తొలి రోజు మజ్జిగ పంపిణీ చేశారు. బాటసారులకు మజ్జిగ, మంచినీరు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

దాహం తీర్చడం మాధవ సేవే

మైలవరం: దాహార్తుల దాహం తీర్చడం మాధవ సేవేనని వైస్ ప్రిన్సిపాల్ పి.రంగారావు తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాల గేటు వద్ద బుధవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని రంగారావు ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు స్వచ్ఛంద సేవ కార్యక్రమంలో భాగంగా చలివేంద్రం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఫిజికల్ డైరెక్టర్ మేజర్ మన్నే స్వామి, కంప్యూటర్ సైన్స్ సీనియర్ ఫ్యాకల్టీ డాక్టర్ ఎన్.వెంకటాద్రి, రాఘవ, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభం

తిరువూరు: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో దాతల సహకారంతో మంచినీటి చలివేంద్రాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. పట్టణ వ్యాపార ప్రముఖులు నాళ్ల సాయిప్రసాద్, ముత్యాల నాగేశ్వరరావుల వితరణతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆర్టీసీ డిపో మేనేజర్ వేణు ప్రారంభించారు. దాతలను అభినందించారు. ప్రయాణికులకు మంచినీరు అందుబాటులో ఉండే విధంగా చలివేంద్రం నిర్వహిస్తామని డీఎం తెలిపారు.

'అభివృద్ధి అనే పదానికి అర్థం తెలియని వ్యక్తి కేశినేని'

ఎమ్మెల్యే రక్షణనిధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: అభివృద్ధి అనే పదానికి అర్థం తెలియని వ్యక్తి విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) అని తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి విమర్శించారు. స్థానిక నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత నాలుగేళ్లుగా ఎంపీ కేశినేని తిరువూరు వైపు కన్నెత్తి కూడా చూడలేదన్నారు. ఇప్పుడు ఉనికిని కాపాడుకోడానికి తనపై విమర్శలు కురిపిస్తున్నారని మండిపడ్డారు. ఎంపీగా విఫలమైన నాని తిరువూరు నియోజకవర్గంలో అభివృద్ధి గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. తమ ప్రభుత్వం గత నాలుగేళ్లలో రూ.1,400 కోట్ల మేర తిరువూరు నియోజకవర్గానికి నిధులు కేటాయించగా, ఎంపీ ఒక్క పైసా కూడా విదల్చలేదని ఎమ్మెల్యే ఆరోపించారు. తన సోదరుడు చిన్నితో నెలకొన్న విబేధాల నేపథ్యంలో ఇంటిని చక్కదిద్దుకోలేని ఎంపీ ప్రైవేటు కార్యక్రమాలకు వచ్చి రాజకీయాలు చేయడం అవివేకమన్నారు. పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధి నిధులతో తిరువూరుకు వాటర్ ట్యాంకులు మంజూరు చేశానని చెబుతున్న ఎంపీ అవి ఎక్కడున్నాయో చెప్పాలని నిలదీశారు. కరోనా సమయంలో ప్రజల గోడు పట్టించుకోని ఎంపీ నానీ మళ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో తిరువూరు వచ్చారని విమర్శించారు. తిరువూరు నియోజకవర్గంలో ఉపాధి కల్పనకు, వ్యవసాయ రంగాభివృద్ధికి, పారిశ్రామికాభివృద్ధికి కేంద్రప్రభుత్వం నుంచి అనుమతులు తెచ్చే అవకాశం ఉన్నా ఎంపీ బాధ్యతారహితంగా వ్యవహరించి నియోజకవర్గ అభివృద్ధిని తుంగలో తొక్కారన్నారు.

ప్రకటనలకే పరిమితమైన ఎంపీ

చింతలపూడి ఎత్తిపోతల పథకం పనుల గురించి తాను శాయశక్తులా కృషిచేస్తుంటే ఎంపీ నాని కనీసం స్పందించకుండా ఇప్పుడు కేవలం ప్రకటనలతో కాలక్షేపం చేస్తున్నారని ఎమ్మెల్యే రక్షణనిధి మండిపడ్డారు. నియోజకవర్గంలో తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, ఎంపీ ఎప్పుడైనా రావచ్చని సవాల్ చేశారు. నియోజకవర్గానికి ఎంపీ ఎన్ని నిధులు కేటాయించారో చెప్పాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి పాల్గొన్నారు.

పలువురికి ఆర్థిక సాయం అందజేత



నగదు అందజేస్తున్న కౌన్సిలర్ దయాసాగర్



పల్లెర్లమూడిలో సామగ్రి అందజేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాలిటీలో వలంటీర్ సురపల్లి సుప్రియ 5 నెలల కుమార్తె లంగ్స్ క్యాన్సర్‌తో బాధపడుతూ విజయవాడలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న క్యాపో సొసైటీ అధ్యక్షుడు, మున్సిపాలిటీ 5వ వార్డు కౌన్సిలర్ మొగిలి దయాసాగర్ సొసైటీ సభ్యులు ద్వారా సమకూర్చిన రూ.20 వేలు నగదు ఆర్థిక సహాయం చిన్నారి తల్లిదండ్రులకు బుధవారం అందజేశారు. ఇప్పటికే రూ.10 లక్షల వరకు ఖర్చు చేసి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తల్లిదండ్రులకు తమ వంతు సాయం అందించామని తెలిపారు. ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

అట్లూరి చారిటబుల్ ట్రస్ట్ సాయం..

నూజివీడు: మండలంలోని పల్లెర్లమూడిలో ఇటీవల అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన దావులూరి రాధాకృష్ణ కుటుంబ సభ్యులకు అట్లూరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అట్లూరి నరేంద్ర బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రెండు జతల దుస్తులు, వంట పాత్రలు, 25 కిలోల బియ్యం, రూ.2 వేల నగదును అందించారు. కార్యక్రమంలో యనమదల సత్యనారాయణ, బెజవాడ శ్రీనివాసరావు, దావులూరి కృష్ణమోహన్, కంభంపాటి వాసు, శివ, అట్లూరి హనుమంతరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు పరామర్శ



ఆగిరిపల్లి: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఈదులగూడెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కందుల శ్రీనివాసరావును బుధవారం ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని ధైర్యంగా ఉండాలన్నారు. ఎమ్మెల్యే వెంట నాయకులు ఈలప్రోలు వెంకట సుబ్బయ్య, మండల సచివాలయాల కన్వీనర్ నందూరి భాస్కర్ ప్రసాద్ ఉన్నారు.

చార్లెస్ డార్విన్‌కు నివాళి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): జీవశాస్త్ర పితామహుడు చార్లెస్ డార్విన్ వర్ధంతిని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కొండపల్లి నాగార్జున పాఠశాలలో బుధవారం జరిగింది. కార్యక్రమంలో పట్టణ ప్రాథమిక వైద్యశాల డాక్టర్ కంఠం శ్రావ్యపూర్ణిమ డార్విన్ చిత్రపటానికి నివాళులర్పించారు. మూఢ నమ్మకాలను వ్యతిరేకించడంలో డార్విన్ కీలకపాత్ర పోషించారన్నారు. జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు, సర్దార్ సాహెబ్, చేతన్‌మురళి పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



చింతలనర్వ(గంపలగూడెం): మండలంలోని చింతల నర్వకు చెందిన కంచె రాంబాబు(38) గుండె పోటుతో బుధవారం మృతి చెందాడు. వైఎస్సార్ బీమా కింద మృతుని భార్య స్వప్నకు సర్పంచ్ గద్దల జాన్ కోటయ్య, ఎంపీటీసీ జొన్నలగడ్డ మేరిశాంతిలు రూ.10 వేలు తక్షణ సాయంగా అందజేశారు. పంచాయతీ కార్యదర్శి సంధ్య, నాయకులు ప్రేమరాజు పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్య పథకానికి 18 దరఖాస్తులు

ఇబ్రహీంపట్నం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మిషన్ వాత్సల్య పథకానికి తొలి విడతలో 18 దరఖాస్తులు వచ్చాయని ఎంఈఓ సీహెచ్ పుష్పలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను జిల్లా ఉన్నతాధికారులకు పంపామన్నారు. ఎవరైనా తల్లి, తండ్రి మరణించిన వారు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల పిల్లలు, అనాథ బాలబాలికలు 18 ఏళ్ల లోపు వయస్సు కలిగి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వారు త్వరగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.